# నిరపరాధి

**మూలవాక్యము:-** మత్త 27:4 నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారు దానితో మాకేమి? నీవే చూచుకొనుమని చెప్పగా...

యేసు ప్రభువుని అప్పగించిన ఇస్కరియోతు యూదా చెప్పిన మాట ఇది. ఇక్కడ నిరపరాధి యేసుక్రీస్తు అని మనకు అర్థమవుతుంది. నేటి అంశంలో నిరపరాధిని గురించి పరిశుద్ధ గ్రంధం ఏమి బోధిస్తుందో గమనిద్దాం.

## I. నిరపరాధి అనగా అర్థము:-

నిరపరాధి లేక నిరపరాధము గురించి మనకు తెలియాలంటే అపరాధము అంటే ఏమిటో మనకు తెలియాలి. అపరాధి అనగా తప్పుచేసిన వాడు.నిరపరాధి అనగా తప్పు చేయనివాడు.తప్పు లేని వాడు లని అర్థం. అలాగే పరిశుద్ధ గ్రంధంలో దేవుడు మనుష్యుల కొరకు వారు నీతిగా, యధార్థంగా, భక్తిగా, న్యాయముగా నడుచుకొనుటకు అనేకమైన నియమాలు, నిబంధనలు, కట్టడలు ఇవ్వడం జరిగింది. వాటిని సరిగా పాటించకపోతే అపరాధము చేసిన వారము అవుతాము. దేవుడిచ్చిన ఆజ్ఞలు, నియమాలు, నిబంధనలు, కట్టడలు చక్కగా పాటించువారు నిరపరాధులుగా పిలువబడతారు.

## II. పరిశుద్ధ గ్రంధములో నిరపరాధులుగా పిలువబడిన వారు ఎవరు?

**జెకర్యా, ఎలీజబెతు:-**

**లూకా 1:6:-** వీరిద్దరు ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులైయుండిరి.

**వీరు కాక దావీదు, అబ్నేరు, అమాశా, నాబోతు, యిర్మీయా మొదలగువారు నిరపరాధులుగా పిలువబడ్డారు.**

## III. నిరపరాధులను గురించి వాక్యము ఏమి చెబుతోంది:-

**నిరపరాధిని చంపకూడదు:-** నిర్గమ 23:7 అబద్ధమునకు దూరముగా నుండుము; నిరపరాధినైనను నీతిమంతుడనైనను చంపకూడదు; నేను దుష్టుని నిర్దోషినిగా ఎంచను.

**నిరపరాధిని చంపుటకు లంచము పుచ్చుకొనకూడదు:-** కీర్త 15:5 తన ద్రవ్యము వడ్డికియ్యడు నిరపరాధిని చెరుపుటకై లంచము పుచ్చుకొనడు. ఈ ప్రకారము చేయువాడు ఎన్నడును కదల్చబడడు.

## IV. నిరపరాధిని చంపుట పాపము:-

**1సమూ 19:5:-** అతడు ప్రాణమునకు తెగించి ఆ ఫిలిష్తీయుని చంపగా యెహోవా ఇశ్రాయేలీయుల కందరికి గొప్ప రక్షణ కలుగజేసెను; అది నీవే చూచి సంతోషించితివి గదా; నిష్కారణముగా దావీదును చంపి నిరపరాధి యొక్క ప్రాణము తీసి నీవెందుకు పాపము చేయుదువని మనవి చేయగా

యిర్మీ 26:15 అయితే మీకు చెవులార ఈ మాటలన్నిటిని చెప్పుటకు నిజముగా యెహోవా మీ యొద్దకు నన్ను పంపి యున్నాడు గనుక, మీరు నన్ను చంపిన యెడల మీరు మీ మీదికిని ఈ పట్టణము మీదికిని దాని నివాసుల మీదికిని నిరపరాధి రక్తదోషము తెప్పించుదురని నిస్సందేహముగా తెలిసికొనుడి.

## V. నిరపరాధులను చంపిన వారికి ప్రతిఫలము – మరణము :-

**యోవాబు మరణం :- 1 రాజులు 2:29-31** యోవాబు పారిపోయి యెహోవా గుడారమునకు వచ్చి బలిపీఠము నొద్ద నున్నాడను సంగతి రాజగు సొలొమోనునకు వినబడగా సొలొమోను యెహోయాదా కుమారుడైన బెనాయాను పిలిపించి నీవు వెళ్లి వాని మీద పడుమని ఆజ్ఞ ఇచ్చినందున బెనాయా యెహోవా గుడారమునకు వచ్చి – రాజు నిన్ను బయటికి రమ్మని సెలవిచ్చెనని యోవాబుతో చెప్పెను. అతడు – అది కాదు, నేనిక్కడనే చచ్చెదననగా, బెనాయా తిరిగి రాజు నొద్దకు వచ్చి యెవాబు తనతో చెప్పిన మాట రాజునకు తెలియజేసెను. అందుకు రాజు ఇట్లనెను – అతడు నీతో చెప్పినట్లు చేయుము; <u>అతడు ధారపోసిన నిరపరాధుల రక్తమును</u> నా మట్టుకును నా తండ్రి కుటుంబికుల మట్టుకును పరిహారము చేయుటకై అతని చంపి పాతిపెట్టుము.

**యోవాబు చంపిన నిరపరాధులు:-**

**1రాజులు 2:5,6:-** అయితే సెరూయా కుమారుడైన యోవాబు నాకు చేసిన దానిని, ఇశ్రాయేలు సేనాధిపతులగు నేరు కుమారుడైన అబ్నేరు యెతెరు కుమారుడైన అమాశాయను వారిద్దరికి అతడు చేసిన దానిని నీవెరుగుదువు; అతడు వారిని చంపి యుద్ధ సమయమందైనట్లుగా సమాధాన కాలమందు రక్తము చిందించి దానిని తన నడికట్టు మీదను తన పాదరక్షల మీదను పడజేసెను. నీకు తోచినట్లు అతనికి చేయవచ్చును గాని అతని నెరసిన తల వెంట్రుకలను సమాధికి నెమ్మదిగా దిగనియ్యవద్దు.

**నిరపరాధులైన రాజకుమారులందరిని చంపివేసిన అతల్యా చివరకు తను కూడ చనిపోవలసి వచ్చింది.**

**అతల్యా:- 2రాజులు 11:1** అహజ్యా తల్లియైన అతల్యా తన కుమారుడు మృతిబొందెనని తెలిసికొని లేచి రాజకుమారుల నందరిని నాశనము చేసెను.

**2రాజులు 11:16** రాజ మందిరములోనికి గుఱ్ఱములు వచ్చు మార్గమున ఆమెకు దారి ఇచ్చిరి. ఆమె వెళ్లిపోగా వారు ఆమెను పట్టుకొని చంపిరి.

**యెజెబెలు:- 2రాజులు 9:10** యెజెబెలు పాతి పెట్టబడక యెజ్రెయేలు భూభాగమందు కుక్కల చేత తిని వేయబడును. ఆ యౌవనుడు (ఎలీషా ప్రవక్త యొక్క శిష్యుడు) ఈ మాటలు చెప్పి తలుపు తీసి పారిపోయెను.

**2రాజులు 9:33,36,37** దీనిని క్రింద పడద్రోయుడని అతడు(యెహూ)చెప్పగా వారు దానిని క్రిందికి పడ ద్రోసినందున దాని రక్తములో కొంత గోడ మీదను గుఱ్ఱముల మీదను చిందెను. మరియు గుఱ్ఱములచేత అతడు దానిని త్రొక్కించెను.

వారు తిరిగి వచ్చి అతనితో (యెహూ) ఆ సంగతి తెలియజెప్పగా అతడిట్లనెను-ఇది యెజెబెలని యెవరును గుర్తు పట్టలేకుండ యెజ్రెయేలు భూభాగమందు కుక్కలు యెజెబెలు మాంసమును తినును.

యెజెబెలు యొక్క కళేబరము యెజ్రెయేలు భూభాగమందున్న పెంట వలె నుండును అని తన సేవకుడును తిష్బీయుడునగు ఏలీయా ద్వారా యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున యిది జరిగెను.

**యెజెబెలను గూర్చిన ఏలియా ప్రవచనం:-**

**1రాజులు 21:23 మరియు యెజెబెలును గూర్చి యెహోవా సెలవిచ్చునదేమనగా – యెజ్రెయేలు ప్రాకారము నొద్ద కుక్కలు యెజెబెలును తినివేయును.**

**యెజెబెలు నిరపరాధియైన నాబోతును చంపించుట:-**

**1రాజులు 21:12,13 ఎట్లనగా వారు ఉపవాస దినము చాటించి నాబోతును జనుల యెదుట నిలువబెట్టిరి. అప్పుడు పనికిమాలిన యిద్దరు మనుష్యులు సమాజములో ప్రవేశించి అతని యెదుట కూర్చుండి – నాబోతు దేవునిని రాజును దూషించెనని జనుల సమక్షమున నాబోతు మీద సాక్ష్యము పలుకగా వారు పట్టణము బయటికి అతనిని తీసికొని పోయి**

**రాళ్లతో చావగొట్టిరి.**

## VI. నిరపరాధులుగా జీవించుట వలన కలుగు ఆశీర్వాదము బలము:-

**యోబు 17:9** అయితే నీతిమంతులు తమ మార్గమును విడువక ప్రవర్తించుదురు. నిరపరాధులు అంతకంతకు బలము నొందుదురు.

**భక్తిహీనులు సంపాదించి దాచిన వెండి నిరపరాధులు పంచుకొనెదరు:- యోబు 27:17,13**

వారు(భక్తిహీనులు 13.వ.)దాని సిద్ధపరచుకొనుటయే గాని నీతిమంతులు దాని కట్టుకొనెదరు. నిరపరాధులు ఆ వెండిని పంచుకొనెదరు.

## VII. మనము ఏలాగు నిరపరాధులముగా మార్చబడతాము:-

**విశ్వాసులు నిరపరాధులుగా ఉండవలెనని దేవుడు కోరుచున్నాడు:- ఫిలి 2:14** మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి.

**మనల్ని నిరపరాధులుగా చేయుటకు క్రీస్తు ప్రాణ త్యాగము చేశాడు:- కొల 1:22** తన సన్నిధిని పరిశుద్ధులు గాను నిర్దోషులు గాను నిరపరాధులు గాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను.

**హెచ్చరిక:-**

**సంఖ్యా 14:18** దోషమును అతిక్రమమును పరిహరించువాడును, అపరాధిని నిరపరాధిగా ఎంచక మూడునాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి తెచ్చువాడునై యున్నాడని నీవు చెప్పిన నా ప్రభువు యొక్క బలము ఘనపరచబడును గాక.

నిరపరాధియైన యేసు క్రీస్తును ముప్పది వెండి నాణెములకు అమ్మివేసి ప్రధానయాజకులకు అప్పగించిన ఇస్కరియోతు యూదా చివరికి ఉరి పెట్టుకొని చనిపోయాడు. (మత్తయి 27:5) అయితే యేసు క్రీస్తును సిలువ వేయడానికి అప్పగించిన పిలాతు ఆయన నీతిమంతుడు అని సాక్ష్యమిచ్చి ఆయన మరణము వలన వచ్చే శిక్ష నుండి తప్పించుకొనగోరి చేతులు కడుగుకొని ఈ నీతిమంతుని రక్తము నిమిత్తము నేను నిరపరాధిని అని చెప్పినట్టు వాక్యము లో చూస్తున్నాము.

**మత్త 27:24** పిలాతు అల్లరి ఎక్కువగుచున్నదే గాని తన వలన ప్రయోజనమేమియు లేదని గ్రహించి, నీళ్లుతీసికొని జనసమూహము ఎదుట చేతులు కడుగుకొని ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని మీరే చూచుకొనుడని చెప్పెను.

ప్రియ సహోదరుడా! సహోదరి ఈ లెంటులో మన పాపములు ఒప్పుకొని నిరపరాధియైన క్రీస్తు రక్తమందు కడగబడటం ద్వారా మనము కూడా నిరపరాధులుగా తీర్చబడుదాం. బ్రతుకు కాలమంతా క్రీస్తు సాక్ష్యులుగా నిరపరాధులుగా జీవిద్దాం. మన వలన నిరపరాధులకు కష్టము, నష్టము వాటిల్లకుండా జాగ్రత్త పడుదాం.

**అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకనుగ్రహించును గాక.**